# ప్లీజ్, నన్ను జైలుకి పంపరూ?

## * విశ్వమోహిని *

ఎవరో గట్టిగా కుదిపినట్లయ్యి కళ్ళు తెరిచాడు సుబ్బయ్యశెట్టి.

గదిలో లైటు వెలుగుతోంది.

'కరెంట్ వచ్చిందన్నమాట' అనుకున్నాడు. పడుకునేప్పటికి కరెంటు లేదు మరి.

అంతలోనే తన మీదకు వంగివున్న ఆగంతకుడివంక చూసి అదిరిపడ్డాడు శెట్టి. ఒక క్షణం ఏమీ బోధపడలేదు అతనికి. బోధపడేసరికి అతను మంచం మీద లేడు.

చటుక్కున లేచి కూర్చున్నాడు.

అది అర్ధరాత్రి అని తెలుస్తూనే వుంది.

ఆ యువకు డెవరో ఆగంతకుడనీ అర్థమవుతూనే వుంది.

అర్థం కానిదల్లా ఒక్కటే.

ఆ యువకుడెవరు?

ఆ వేళప్పుడు ఇంట్లోకి ఎలా వచ్చాడు?!

'దొంగ కాదు గదా!?'

ఆ ఆలోచన రాగానే నిలువెల్లా వణికిపోయాడు సుబ్బయ్యశెట్టి.

అతని ఆలోచనను పసిగట్టినట్టుగా, "నేను దొంగను!" అన్నాడు ఆ యువకుడు గంభీరంగా.

పాతికేళ్ళుంటాయి అతనికి. సన్నగా, పొడవుగా వున్నాడు. తెలుపూ-నలుపూ కాని రంగు. రంగు వెలిసిపోయిన టెరికాట్ పాంటులో షర్టు టక్ చేసాడు. క్రాపు చెదిరిపోయింది కళ్ళు ఎర్రగా వున్నాయి. నీరసంగా వున్న ముఖం కళగా వుంది.


"ఎవరు నువ్వు?" అన్నాడు శెట్టి ధైర్యం తెచ్చుకుని.

"చెప్పాను కదూ? దొంగను!" జవాబిచ్చాడు ఆ యువకుడు.

సుబ్బయ్యశెట్టికి దొంగలంటే భయం. పైగా దొంగను చూడడం అదే ప్రథమం. దానికితోడు ఆ యువకుడు నిర్భయంగా 'దొంగ'నని చాటుకోవడం మరింత భయం కలిగించింది.

"ఎలా వచ్చావ్ లోపలికి?" అని అడిగాడు ఆశ్చర్యపోతూ.

"అలా అడుగు వేశాను..." అన్నాడు ఆ యువకుడు. పదిన్నరకు ఈ వీధిలో లైట్లుపోయాయి కదూ? అప్పుడు ఇంట్లో దూరాను. బీరువా వెనుక నక్కి క్రొవ్వొత్తి వెలుతురులో నువ్వు ఇనప్పెట్టె దగ్గర డబ్బు లెక్కపెట్టడం చూసాను. నువ్వు పడుకోగానే నీ తల




క్రిందనున్న తాళాలు తీసుకుని ఇనప్పెట్టె తెరిచాను. కావలసిన డబ్బు దొంగిలించాను..."

గుండెలు గుభేల్ మన్నాయి శెట్టికి. తలగడ క్రింద చూశాడు.

తాళాలు కనిపించలేదు.

యువకుడు నవ్వుతూ గుప్పెట్లో వున్న తాళపు గుత్తిని శెట్టి వొళ్ళో పడేశాడు

"డబ్బంతా దోచేశావా?" అన్నాడు శెట్టి కంగారుగా.

"లేదు! అయిదువేలే తీసుకున్నాను" అంటూ జేబుల్లో కుక్కుకున్న నోట్ల కట్టల్ని తీసి చూపించాడు యువకుడు.

శెట్టి మనసు కుదుటపడింది.

భయం స్థానే ఆశ్చర్యం చోటు చేసుకుంది అతనిలో.

ఆ యువకుడు దొంగ అని తెలుస్తూనే వుంది. అయితే దొంగతనానికి వచ్చిన వాడు ఇనప్పెట్టె అంతా ఎందుకు ఖాళీ చేయలేదు? దొంగసొమ్ముతో పారిపోకుండా తనను నిద్ర లేపాడెందుకు? తాను దొంగనంటూ ప్రకటించుకున్నాడెందుకు?

అతను అమాయకుడా?

లేక-ఏదైనా పెద్ద ఎత్తులో వున్నాడా?

అతని దగ్గర ఆయుధమేదీ వున్నట్టు కూడా లేదు.

ఇప్పుడేం చేస్తాడతను?

తాను ఏం చేయాలి?

-ఇలా సాగిపోతున్నాయి శెట్టి ఆలోచనలు.

"ఏమిటలా గుడ్లు మిటకరించి చూస్తున్నావ్? నేను దొంగతనం చేశానని చెప్పలేదూ?" శెట్టి వాలకానికి

చిరాకుపడుతూ అన్నాడతను.

"అయితే?" అన్నాడు శెట్టి అప్రయత్నంగా

"పోలీసుల్ని పిలు!"

శెట్టి ఉలిక్కిపడ్డాడు.

అది చూసి ఆశ్చర్యపోతూ, "పోలీసుల పేరు చెబితే నువ్వు వులిక్కిపడతావెందుకు?" అన్నాడు యువకుడు.

ఎందుకో శెట్టికి తెలుసు.

అతని ఇనప్పెట్టెలో వున్నది బ్లాక్ మనీ మరి.

"పోలీసు లెందుకు?" అన్నాడు శెట్టి ఏమనాలో తెలీక.

"నన్ను పట్టించడానికి" తాపీగా జవాబిచ్చాడతను

"నిన్నెందుకు పట్టించడం?"

"దొంగను కనుక!"

పిచ్చివాణ్ణి చూసినట్టు చూసాడు శెట్టి. ఆ యువకుడికి కొద్దిగా 'స్క్రూ' లూజ్ అయివుండా లనిపించింది. నేర్పుగా అతన్ని వదిలించుకోవాలనుకున్నాడు.

"నీ పేరేమిటి?" అని అడిగాడు.

"దొంగ."

"మంచిపేరే! పిల్లలు బ్రతక్కపోతే నీకు ఆ పేరు పెట్టివుంటారు నీ తల్లిదండ్రులు" అన్నాడు శెట్టి.

"ఉష్! అది నా తల్లిదండ్రులు పెట్టిన పేరు కాదు. వృత్తిరీత్యా వచ్చినది" అన్నాడు యువకుడు అసహనంగా.

"కబుర్లతో కాలం గడపక త్వరగా పోలీసుల్ని పిలు!"

"అనవసరంగా పోలీసు లెందుకబ్బాయ్?"

"ఎందుకేమిటి? దొంగను పట్టించడానికి?"

"దొంగ ఎవరు?"

"నేనే!"

"నువ్వు దొంగవని ఎవరన్నారు?"

"నేనే అంటున్నాను!"

"నువ్వు దొంగవెలా అవుతావ్?"

"మీ ఇంట్లో దొంగతనంగా దూరి, మీ ఇనప్పెట్టెలోంచి సొమ్ము కాజేసిన వాడు దొంగకాక దొర అవుతాడా?"

"నువ్వుత్త పిచ్చివాడిలా వున్నావ్! దొంగ వాడెవడూ యజమానిని నిద్రలేపి తాను దొంగనని చెప్పుకోడు!"

"కాని నేను చెప్పుకుంటున్నాను కదా!"

"అందుకే నువ్వు దొంగవు కాదంటున్నాను!"

కోపంగా చూసాడు యువకుడు.

"నువ్వేదో తికమకగా మాట్లాడుతున్నావ్. దొంగతనం చేసింది నేను. దొంగిలించిన సొమ్ము నా చేతిలో వుంది. నేను దొంగను కాదనడానికి నువ్వెవరివి? మర్యాదగా పోలీసుల్ని పిలిపించు."

అదేదో మెంటల్ కేసన్న నిర్ధారణకొచ్చాడు శెట్టి.

"చూడు బాబూ! నా సొమ్ము దొంగిలించినట్టు నువ్వే చెప్పుకుంటున్నావు

కనుక నా డబ్బు నా కిచ్చేసి నీ దారిన నువ్వు వెళ్ళిపో। పోలీసుల దాకా వెళ్ళితే పైసలు గల్లంతవుతాయి" అన్నాడు శెట్టి లౌక్యంగా.

"నథింగ్ డూయింగ్ నువ్విప్పుడు పోలీసుల్ని పిలిచి నన్ను అప్పగించ వలసిందే!" అంటూ మొండికేసాడు యువకుడు.

"చూస్తుంటే చదువుకున్న వాడిలా కనిపిస్తున్నావ్. పైగా, నీకు యిదే మొదటి అనుభవంలా కనిపిస్తోంది. అన్నట్టు నాకూ యిదే మొదటి అనుభవం అనుకో- అదే- దొంగను చూడటం... ఎంత అవసరంలో వుండి ఈ పనికి పూనుకున్నావో! ఆ డబ్బు తీసుకుని గప్‌చిప్‌గా వెళ్ళిపో" అన్నాడు శెట్టి.

నిజంగానే అది మొదటి అనుభవం అతనికి. దొంగ తనను పోలీసులకు పట్టివ్వమనడం కొత్తగా వుంది వింతగానూ వుంది.

ఆ యువకుడికీ ఆశ్చర్యంగానే వుంది. తనకు తెలిసినంతమటుకు దొంగ దొరకగానే పోలీసులకు పట్టివ్వాలి ఎవరైనా కాని శెట్టి ప్రవర్తన అందుకు భిన్నంగా వుంది.

"నేను చెప్పినట్టు చేయకపోతే ఏం చేస్తావో తెలుసా!"

యువకుడి స్వరానికి నిజంగానే బెదిరాడు శెట్టి. కొంపదీసి కలబడి కొట్టడు గదా అనుకున్నాడు.

అయినా పైకి బింకంగా, "ఏం చేస్తావేం!" అన్నాడు.

ఒక అడుగు ముందుకు వేసాడు ఆ యువకుడు.

శెట్టి గుండెలు దడదడలాడాయి.

హఠాత్తుగా చేతులు జోడించాడు యువకుడు.

"ప్లీజ్! నన్ను పోలీసులకు అప్పగించరూ!" అంటూ దీనంగా వేడుకున్నాడు.

ఏదో చేస్తాడనుకున్న అతను అలా ప్రాధేయపడేసరికి తెల్లబోయాడు శెట్టి. అది తప్పకుండా మెంటల్ కేసేనని మరోసారి అనుకున్నాడు.

పోలీసుల పీడను కూడా తనమీద పడనీయడం ఇష్టం లేదు శెట్టికి. ఎలాగోలా ఆ యువకుణ్ణి వదిలించుకోవాలనుకున్నాడు.

"పోలీసులంటే నీ కంత ప్రేమ ఎందుకో నాకు బోధపడడంలేదు కాని, అనవసరంగా నిన్ను వాళ్ళకు అప్పగించి పాపం చేసుకోలేను" శెట్టి దృఢంగా- "బంగారంలాంటి నిద్ర పాడై పోయింది, దయచేసి వెళ్ళిపో."

శెట్టి పలుకులు ఆ యువకుడికి వుక్రోషం తెప్పించాయి.

"ఆల్‌రైట్ తిన్నగా నేనే పోలీస్ స్టేషన్‌కి వెళతాను దొంగసొమ్ము చూపించి లొంగిపోతాను" అంటూ విసురుగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

## 2

తెల్లవారుఝాము అయింది.

పోలీస్ స్టేషన్ వరండాలో తుపాకీని గోడకు చేరవేసి కూర్చునే కునికిపాట్లు పడుతున్నాడు సెంట్రీ ఖాదర్ బాషా.

"సార్!" అంటూ ఎవరో భుజంమీద తట్టడంతో అదిరిపడి లేచాడు అతను.

టోపీ సర్దుకుని కంగారుగా చూసాడు ఎస్.ఐ.గారి చెకింగ్‌కి వచ్చేడేమోనన్న భయంతో.

కాని—

కళ్లెదుట ఆ యువకుడు!

అతనివంక కోపంగా చూసాడు.

"ఏంసార్?" అన్నాడు వెటకారంగా.

నిద్ర పాడుచేసాడన్న కోపంతో, "ఎవరు నువ్వు?" అంటూ కసిరాడు.

"నేను...దొంగను..."

ఉలిక్కిపడి, అర్జెంటుగా గన్ అందుకున్నాడు సెంట్రీ.

"సార్! సుబ్బయ్యశెట్టి ఇంట్లో దొంగతనం చేసాను నేను-" అంటూన్న ఆ యువకునివంక అయోమయంగా చూసాడు సెంట్రీ. యాభయ్యేళ్లుంటాయి అతనికి. దాదాపు ముప్పయ్యేళ్ళ నుంచి సర్వీస్ చేస్తున్నాడు. ఓ దొంగ తనంతట తానుగా వచ్చి దొంగతనం చేసానని చెప్పడం అతని సర్వీసులో అదే మొదటిసారి!

ఎంత చావగొట్టినా నేరం చేయలేదు మొర్రో అంటూ తొంకేవాడే గాని, తనంతట తానుగా నిజం చెప్పడం విశేషమే మరి!

హఠాత్తుగా ఏదో అనుమానం కలిగింది ఖాదర్‌కి.

ఆ యువకుడి పాదాలవంక చూసాడు.

మామూలుగానే వున్నాయి అవి. వెనక్కి తిరిగి లేవు-

గుండె చిక్కబడింది అతనికి.

ఆ యువకుడు మనిషే.

దయ్యం కాదు!

"సార్! నమ్మకం కలగవట్లేంది మీకు- ఇదిగో చూడండి, దొంగిలించిన సొమ్ము" అంటూ జేబులోంచి నోట్ల కట్టలుతీసి సెంట్రీ కళ్ళముందు వుంచాడు ఆ యువకుడు.

డబ్బు చూడగానే మతిపోయింది ఖాదర్‌కి. తాను కలగనడంలేదు గదా!

"ఏయ్! నన్ను గిల్లు" అన్నాడు చేయి చాచి.

చేతిమీద గట్టిగా గిల్లాడు యువకుడు.

కెవ్వుమన్నాడు ఖాదర్.

ఖాదర్ అరుపుకు లోపల నిద్ర పోతూన్న జవాన్లలో ఒకడికి మెలకువ వచ్చింది.

"ఏమిటి ఖాదర్ మియ్యా, దయ్యం పట్టినవాడిలా అరుస్తున్నావ్?" అంటూ అక్కడికి వచ్చాడు ఆ కానిస్టేబుల్.

"చూశావోయ్, ఏసుపాదం! ఈ పైకాప్ నా నిద్ర పాడుచేయడమే కాక, నాతో పరాచికాలాడుతున్నాడు" అన్నాడు ఖాదర్ అతనితో.

"పరాచికాలు కాదుసార్! వచ్చి నిజం- సుబ్బయ్యశెట్టి ఇంట్లో దొంగతనం చేశాను" అన్నాడు యువకుడు

ఈసారి ఖాదరు అవస్థ ఏసుపాదానికి పట్టింది.

ఎందుకైనా మంచిదని, "తెల్లవారేంత దాకా ఇతన్ని లాకప్‌లో పడెయ్, ఖాదర్ మియ్యా!" అని సలహా ఇచ్చాడు ఏసుపాదం నిద్రమత్తుతో.

లాకప్‌రూంలో ప్రవేశిస్తూంటే ఆ యువకుడి వదనంలో మెరుపు!

* * *

అయితే—

ఆ మెరుపు తూర్పు తెల్లవారేంత వరకే!

ఉదయం ఎస్.ఐ. రాగానే దర్యాప్తు జరిగింది.

సుబ్బయ్యశెట్టి తన ఇంట్లో దొంగతనం జరుగలేదని చెప్పాడు

అయినా ఆ యువకుడు తాను దొంగనని పట్టుపట్టడంతో అతన్ని ఓ పిచ్చివాడిగా జమకట్టారు పోలీసులు

"పిచ్చాసుపత్రికి దారి తెలీక పోలీస్ స్టేషన్‌లో దూరివట్లున్నావ్! వెళ్ళరా" అంటూ అతని దగ్గరున్న సొమ్మంతా లాక్కుని బయటకు గెంటేసారు పోలీసులు

## 3

మాజిస్ట్రేట్ కోర్టు కిటకిటలాడుతోంది.

మాజిస్ట్రేట్ ఓ యువతి.

బోనులో- ఆ యువకుడు!

"మిలార్డ్!..." అంటూ ప్రారంభించాడు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ అలవాటు ప్రకారం. "ఇదొక వింత కేసు- ఈ యువకుడి పేరు సత్యం- కాని ఇతను చెప్పేదంతా అసత్యం!... నిన్న అనరబుల్ మాజిస్ట్రేట్‌వారి దగ్గరకు వెళ్ళి తాను దొంగననీ, సుబ్బయ్యశెట్టి ఇంట్లో దొంగతనం చేసాననీ చెప్పుకున్నాడు. ఫలితంగా పోలీసులు ఇతన్ని అరెస్టు చేసి దర్యాప్తు జరిపారు. దర్యాప్తులో తేలిందేమంటే సుబ్బయ్యశెట్టి ఇంటిలో ఎటువంటి దొంగతనమూ జరగలేదని! పైగా దొంగిలించిన సొమ్మును పోలీసులు లాక్కున్నారన్నాడు. అదీ అబద్ధమేనని తేలింది- మిలార్డ్! దొంగ తాను దొంగనని చెప్పుకోడు. కనుక ఈ యువకుడికి మతి స్థిమితంలేదని తెలుస్తోంది. ఇతని ఇన్‌సిస్టెన్స్ కారణంగా కేసు కోర్టు వరకూ తీసుకురావడమయింది. ఎటువంటి ఆధారమూ లేని ఈ కేసును కొట్టివేసి, కోర్టును మిస్‌లీడ్ చేసినందుకు ఇతన్ని శిక్షించవలసిందిగా కోర్టువారిని కోరుతున్నాను" అనేసి, ఓసారి ప్రేక్షకుల వంక సగర్వంగా చూసి తన స్థానంలో కూర్చున్నాడు ఏ పి పి.

"నేరం చేసినట్టు ముద్దాయి తానుగా చెప్పుకుంటున్నాడు కాని, అతని వద్ద దొంగసొమ్ము లేదు. పైగా, ఎవరి

సొమ్ము దొంగిలించినట్లు చెబుతున్నారో, ఆ వ్యక్తి తన ఇంట్లో దొంగతనమే జరుగలేదని సాక్ష్యం ఇచ్చారు. సత్యం అనే ఈ యువకుడు దొంగతనం చేసాడనడానికి సాక్ష్యాధారాలు ఏవీ లేవు కనుక ఈ కేసు కొట్టివేస్తూ ఇంకెప్పుడూ కోర్టువారి సమయాన్ని ఇలా వృధా పరచకుండా వార్నింగ్ ఇస్తూ, ఇతన్ని విడుదల చేస్తున్నాము" అంటూ తీర్పు ఇచ్చింది మాజిస్ట్రేట్.

ఆ తీర్పు వింటూనే, "నో నో... ప్లీజ్! నన్ను జైలుకి పంపండి..." అని అరుస్తూ కోపంతో కుప్పలా కూలిపోయాడు ఆ యువకుడు. ముఖం చేతుల్లో కప్పుకుని భోరున ఏడ్చాడు.

ఆ సంఘటనకు తెల్లబోయారంతా. అతని ప్రవర్తన చకితుల్ని చేసింది అందరినీ. అందరూ తలో విధంగా భాష్యం చెప్పుకున్నారు అతని చర్యకు.

చాంబర్‌లోకి రిటైర్ అయిన మ్యాజిస్ట్రేట్ నుంచి కబురు వచ్చింది ఆ యువకుడికి.

లోతుకుపోయిన కళ్ళతో, మాసిన గెడ్డంతో, పాలిపోయిన ముఖంతో, నీరసంగావున్న ఆ యువకుడివంక ఓ క్షణం పరిశీలనగా చూసింది మాజిస్ట్రేట్.

కన్నీటిచారలు అతని దవడలపైన ఇంకా కనిపిస్తున్నాయి. అతని చూపులు దైన్యంగా వున్నాయి.

"మిస్టర్ సత్యం! నిన్ను చూస్తుంటే చదువుకున్నవాడిలా కనిపిస్తున్నావ్, అవునా?" అంటూ ప్రశ్నించిందామె.

చిన్నగా తలవూపాడతను.

"మనిషి దొంగలా అనిపించడం లేదు. నేరంచేసి తప్పించుకోవడానికి శతవిధాలా ప్రయత్నించే ఈ లోకంలో- లేని నేరాన్ని నెత్తిన వేసుకుని జైలుకు వెళ్ళాలని అంత తాపత్రయపడ్డావెందుకు? ఏదో విధంగా జెయిల్‌కి వెళ్ళాలన్న ఆరాటం నీలో కనిపిస్తోంది. అందుకు బలమైన కారణం ఏదో వుండితీరాలి... అదేమిటో చెబితే వినాలని వుంది" అన్నదామె.

మాజిస్ట్రేట్ వంక వింతగా చూసాడు సత్యం. ఆమె పలుకులలో శ్రద్ధ, నిజాయితీ కనిపించాయి.

"నా దీనగాథ విని మీరు బాధపడటం తప్ప ఏం చేయగలరు, మాడమ్!" అన్నాడు తల దించుకుని.

"ఏం చేయగలను అన్నది, విన్న తరువాత ఆలోచించవలసిన విషయం- అభ్యంతరం లేకపోతే నీ బాధేంటో చెప్పు" అందామె.

"ఈ దేశంలోని చాలామందిలాగే నాదీ మామూలు కథే! మీవంటి పెద్ద స్థానంలో వుండి నావంటి అనామకుడిపైన శ్రద్ధాసక్తులను చూపడం మీ సహృదయతను తెలియజేస్తుంది... అందుకే, చెబుతాను వినండి విన్నాకనైనా నన్ను జైలుకి పంపితే సంతోషి



స్తాను" అంటూ తన గాథ చెప్పుకు పోయాడు అతను.

"నా పేరు సత్యం ఓ తల్లీ. చెల్లెలూ నా వాళ్ళు. మా నాన్న యాక్సిడెంటులో పోవడంతో అంట్లు తోమి మమ్మల్ని పెంచింది అమ్మ. కూలిపనికి వెళతానంటే తిట్టి నన్ను స్కూలుకు పంపించింది. బిఏ వరకు చదివించింది. నేను డిగ్రీ తీసుకోగానే తన కష్టాలు తీరి పోయినట్లు మురిసిపోయింది అమ్మ. కాని, డిగ్రీ తీసుకుని అయిదేళ్ళు గడిచినా ప్యూను వుద్యోగం కూడా దొరకలేదు. ప్రయత్న లోపంలేదు. లోపమల్లా ఉత్తర దక్షిణల్లోనే!... నా చదువు ముగియగానే ఆదుకుంటావనీ, చెల్లిని వుద్ధరిస్తావనీ కలలు కనేది అమ్మ- ఆ ఆశతోనే వుపవాసాలతో ఎండిన కట్టెతో కష్టపడేది. కాని... చదువు ముగిసి అయిదేళ్ళయినా ఏ దారీ కనిపించకపోయేసరికి మాకిక గోదారే గతి అన్న నమ్మకం ఏర్పడి పోయిందామెలో. అదే బెంగతో మంచం పట్టింది పన్నెండేళ్ళ చెల్లాయి పాచిపనికి వెళుతూంటే నా ప్రాణం గిలగిలా కొట్టు కునేది కనీసం కూలిపనయినా దొరుకు తుందేమోనని ఎంతో ప్రయత్నించాను- ఉద్యోగానికి అనుభవంలేదు- కూలి పనికి ఓవర్ క్వాలిఫైడ్! రెంటికి చెడ్డ రేవడి నయ్యాను. పోనీ, రిక్షా తొక్కుదామను కున్నాను. చదువుకున్నవాడికి రిక్షా ఇస్తే తమ వ్యాపారానికే ప్రమాదమని

చీత్కరించారు..."

ఆ వేగంతో చెప్పుకుపోయాడు అతను.

"మాడమ్! ఇహాలా పేదరికమంటే ఏమిటో మీకు తెలియకపోవచ్చును. అదొక భయంకర శాపం! ఓ పక్క జబ్బుతో, మరోపక్క ఆకలితో బాధపడే తల్లి- ఇంకోప్రక్క పసిపిల్ల పాలివ్వని చేసి గంజినీళ్ళకు దారి చూపడం... నా మనోస్థితి ఎలా వుంటుందో వూహించండి- అప్పుడే తట్టింది నాకీ ఆలోచన- కష్టపడి, న్యాయంగా బ్రతకాలనుకున్న నాలాటివాడికి గంజినీళ్ళు కరువు. ప్రభుత్వం ఏమీ చేయలేదు కాని... నేరాలుచేసి జైలుకు వెళ్ళిన దుష్టులకు మాత్రం తిండికీ, గుడ్డకూ లోటులేదు! లోటల్లా నాలాంటి వాళ్ళకే! అందుకే... అందుకే, మాడమ్! నేను జైలుకి వెళ్ళాలనుకున్నది..."

విభ్రాంతపోయింది మాజిస్ట్రేట్. కొంత సేపటికి తెప్పరిల్లి, "కానీ అలాగే అనుకున్నా, ఇది స్వార్థంకాదూ? నువ్వు జైలుకి వెళితే నీ వాళ్ళ గతేంకాను?" అంది.

"ఆహా... మీరు పొరబడ్డారు... కేవలం నా కోసం ఆలోచించడంలేదు నేను... జైల్లో నా తిండీ, గుడ్డా ప్రభుత్వమే ఇస్తుంది. పోతే, ఖైదీలచేత రోజూ పనులు చేయించుకుని ఇచ్చే కూలి డబ్బులు నెలనెలా నా వాళ్ళకు పంపాలనీ, ఆ విధంగా వాళ్ళ ఇబ్బందులు కొంతవరకైనా తీర్చాలనీ ఆరాటపడ్డాను. అందుకే ఏదో విధంగా జైలుకి వెళ్ళాలని ఆత్రపడ్డాను. దురదృష్టవంతుణ్ణి- ఆ ప్రయత్నమూ బెడిసికొట్టింది..."

ఆమె మాట్లాడలేదు.

ఆ గదిలో హఠాత్తుగా చీమ చిటుక్కుమంటే వినిపించేంతటి నిశ్శబ్దం ఆవరించుకుంది.

అది అతని ఒక్కడి కథే కాదు.

దేశంలో సత్యాలు కోకొల్లలు!

ఇందుకు పరిష్కారం ఏమిటి?

సత్యం ఆలోచనా సరళిలో ఎంతటి సబబు వున్నదన్నది వేరే విషయం.

కాని-

ఓ విద్యాధికుడు కనీసావసరాలైన తిండి, గుడ్డలకోసం జైలుకి వెళ్ళాలని వువ్విళ్ళూరవలసిన అవసరం ఎప్పుడు కలుగుతుంది?

సత్యానికి అటువంటి ఆలోచన కలగడానికి కారకులెవరు?

సమాజమా?

ప్రభుత్వమా??

ఈ దేశపు వ్యవస్థా???

మాజిస్ట్రేట్ స్త్రీ కావడంవల్ల ఆ కథకు కరిగిపోయి, సత్యానికి ఓ మంచి వుద్యోగం ఇప్పించిందన్న ముగింపు ఈ కథకు ఇవ్వడం కష్టం కాదు.

కాని—

లక్షలాది సత్యాల కథలకు ముగింపు ఏమిటి??

దానిని పాఠకుల వూహాకే వదిలేస్తున్నాను... •